ప్రజాశక్తి





మృతి చెందిన కృష్ణకిశోర్, శిరీష, చిన్నారి

ప్రాణం తీసిన రుణభారం

◆ ఐదు నెలల చిన్నారితో సహా భార్యాభర్తలు ఆత్మహత్య

◆ నార్పలలో విషాద ఘటన

రుణభారం ఓ కుటుంబాన్ని బలితీసుకుంది. మెడికల్ షాప్ నిర్వహణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక వారి ఐదు నెలల చిన్నారితో పాటు భార్యాభర్తలు ఉరేసుకుని తనవు చాలించారు. అనంతపురం జిల్లా నార్పల మండలంలో గురువారం వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. నార్పల మండల కేంద్రంలోని పాత పోలీసు స్టేషన్ సంతబజారులో నివసిస్తున్న భార్యాభర్తలు కృష్ణకిషోర్ (45), శిరీష(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తాము మరణిస్తే తమ కూతురు అనాథ అవుతున్న బాధతో ఐదు నెలల చిన్నారినీ చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం చోటు చేసుకోగా గురువారం నాడు స్థానికుల సమాచారం మేరకు బయటకు తెలిసింది. మెడికల్ స్టోర్ నిర్వహించే కృష్ణ కిశోర్ ఆర్థిక ఇబ్బందులను తాళలేకనే కుటుంబం మొత్తం తనువు చాలించినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

వార్త మెయిన్‌లో

అదానీ ప్రాజెక్టులపై నీలినీడలు..!

◆ చిత్రావతి డ్యామ్‌పై హైడ్రో ఎలక్ట్రిక్ సోలార్ ప్రాజెక్టు

◆ రాయదుర్గం వద్ద సోలార్ ప్లాంట్

◆ అమెరికాలో అదానీకి అరెస్టు వారెంట్‌తో వీటి కదలికపై సందేహాలు

అదానీ గ్రీన్ ఎనర్జీ పేరుతో అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ఏర్పాటు చేయబోతున్న సోలార్ పవర్ ప్రాజెక్టుల పరిస్థితి ఏమవుతుందన్న సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. అమెరికాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల కోసమని రుణం పొందే విషయంలో అక్కడి కోర్టు అదానీకి అరెస్టు వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. అది కూడా గ్రీన్ ఎనర్జీకోసం డబ్బులు సమకూర్చే క్రమంలోనే అక్కడి అధికారులకు డబ్బులు ఎర చూపారన్న అభియోగాలపై కోర్టు ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఇక్కడి సోలార్ ప్రాజెక్టులపై ఈ ప్రభావం ఎంత మేరకు ఉండనుందన్నది చర్చ నడుస్తోంది.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాకు ఆనుకుని కడప జిల్లా పరిధిలో ఉన్న చిత్రావతి డ్యామ్‌పై సోలార్ పంప్డ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటు పనులు నడుస్తున్నాయి. పగటి సమయాల్లో సోలార్ సహాయంతోనూ, రాత్రి సమయాల్లో డ్యామ్‌లోని నీటితో విద్యుత్ ఉత్పత్తి జరిగే విధంగా దీని ఏర్పాటు పనులు నడుస్తున్నాయి. 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయబోతున్న ప్రాజెక్టు పనులు 2023 మార్చి నుంచి ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే సర్వేలు పూర్తయ్యి ప్లాంటు ఏర్పాటు పనులు నడుస్తున్నాయి. ఇదే విధంగా అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలో సుమారు పది వేల ఎకరాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించి భూ సమీకరణ పనులను చేపట్టేందుకు గత ప్రభుత్వమే ఉత్వర్వులు ఇచ్చింది. అవసరమైతే 30 వేల ఎకరాలు కూడా ఇస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు వివరాలను ఆ సంస్థకు అందజేశారు. రైతులకు లీజు పద్ధతిలో భూసేకరణ చేపట్టే విధంగా ఉత్వర్వులిచ్చి ఉన్నారు. ఈ మేరకు అదానీ సంస్థ ప్రతినిధులు కూడా భూమిని పరిశీలించి వెళ్లారు. అయితే ఇంకా ఈ ప్రాజెక్టుపై కదలిక రాలేదు. రాబోయే రోజుల్లో వచ్చే అవకాశాలున్నాయన్న ప్రచారం నడుస్తోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ఎటువంటి ప్రకటనా రాలేదు. ఇప్పుడు అదానీపై న్యాయపరమైన చర్యలు రావడంతో ఈ ప్రాజెక్టుల పురోగతిపైనా సందేహాలు నెలకొంటున్నాయి. ఇప్పటికే భూములను కట్టబెట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చి ఉండటం గమనార్హం.

రైతుల్లో ముందు నుంచి గుబులు

ఈ సంస్థ ఏర్పాటు చేస్తారన్నప్పటి నుంచి రైతుల్లో గుబులు నెలకొంటోంది. ఎందుకంటే లీజు పద్ధతిలో సేకరించేందుకు సిద్ధపడుతోంది. లీజు పద్ధతిలో తీసుకున్నాక సకాలంలో లీజు చెల్లించకుంటే ఏదైనా సమస్య వస్తే తమ భూముల పరిస్థితి ఏమిటన్న గుబులు రైతుల్లో నెలకొంది. ఈ సంస్థపై పదేపదే ఆరోపణలొస్తూనే ఉన్నాయి. గతంలో లాగ భూసేకరణ ఎపిఐఐసి ద్వారా కాకుండా సాంప్రదాయ ఇంధన వనరుల శాఖకే అప్పగిస్తున్నారు. సంస్థ చెల్లించలేని పక్షంలో ఆ శాఖ ద్వారా చెల్లించేందుకు కూడా వీలుండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమ భూముల ఏమవుతాయోనన్న భయం కూడా వారిని వెంటాడుతోంది.

సిపిఎం నగర కమిటీ నుంచి బహిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం నగర న్యూ కమిటీ సభ్యుడుగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను పార్టీ నుంచి బహిష్కరించినట్లు సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మినారాయణ సిపిఎంకు తెలియకుండా టీవీ టవర్ ప్రాంతంలో వేసిన ఇళ్ల స్థలాల్లో పేదల నుంచి సుమారు రూ.8 లక్షలు వసూలు చేశాడన్నారు. మహిళలను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, దళితులపై దాడులు చేశాడన్నారు. లక్ష్మినారాయణ చేస్తున్న అరాచకాలపై ప్రజలు సిపిఎం దృష్టికి తీసుకురావడంతో విచారించి ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఇకనుంచి లక్ష్మినారాయణకు సిపిఎంతో ఎటువంటి సంబంధాలు ఉండవని, అతను పాల్పడే చర్యలకు పార్టీకి సంబంధం లేదని తెలియజేశారు.

నేడు ఆర్టీసీ ఛైర్మన్‌గా పూల నాగరాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనంతపురం



ఎపిఎస్ ఆర్‌టిసి కడప జోన్ జోనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌పై ఉన్న జోనల్ ఛైర్మన్ కార్యాలయంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ సమక్షంలో కడప రీజినల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు సిఎం చంద్రబాబు, నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో విద్యార్థినులు, మహిళలకు రక్షణ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఐద్వా,ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో లా విద్యార్థినిపై సామూహిక లైంగిక వేధింపుల దాడి ఘటన అత్యంత విచారకరమైనదన్నారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి విచారణ పేరుతో సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయన్నారు. ఘటనను పక్కదోవ పట్టించే చర్యలు మానుకుని లా విద్యార్థినిపై సామూహికంగా లైంగిక వేధింపులకు గురి చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐదు నెలల కాలంలో కర్నూలు, అనంతపురం, తిరుపతి, కడప తదితర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు చేయాలని కోరారు. మద్యం షాపులను జన సమూహం, కళాశాలలకు దూరంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి చంద్రిక, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, నాయకులు వీరు, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏప్రిల్‌లో మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో అనంత పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అందరి అభిప్రాయం మేరకు ఏప్రిల్ 2వవారంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలకు దేశవ్యాప్తంగా పలువురు ముఖ్యులు హాజరుకానున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థుల సంఘం చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు డాక్టర్ ఆత్మారామ్, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ చైతన్య, డాక్టర్ నీలిమాచౌదరి, డాక్టర్ రమణానాయక్, డాక్టర్ శ్రీహర్ష, సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గ, డాక్టర్ భీమసేనాచారి, డాక్టర్ వేముల శ్రీనివాసులు, డాక్టర్ శైలజ, డాక్టర్ స్వాతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో పైపులైన్ లీకేజీ..

వృథాగా పోతోన్న తాగునీరు



నీటి లీకేజీతో పాచి పట్టిన దృశ్యం

కుంటను తలపిస్తున్న నీరు

ప్రజాశక్తి-గుత్తి

పురపాలక సంఘం పరిధిలోని శ్రీమేధా పాఠశాల సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు వెళ్లే పైపులైన్ లీకేజీ అవుతోంది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. వైటిసి తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి లక్షల లీటర్ల సామర్థ్యంతో అక్కడ ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. ట్యాంకు నుంచి జంగాల కాలనీ, బీసీ కాలనీ తదితర కాలనీల్లోని కొళాయిలకు తాగునీరును సరఫరా చేస్తారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య నెలకొంది. నెలకు ఒకసారి లేక రెండు సార్లు మాత్రమే అధికారులు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నెలరోజుల క్రితం పైపులైను లీకేజీ కావడంతో ఓవర్ హెడ్ ట్యాంకుకు వెళ్లాల్సిన తాగునీరు వృథాగా పోతోంది. అయినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో నివాసాల మధ్య నీరు చేరి కుంటలను తలపిస్తోంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో నీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. దోమల వల్ల రోగాల బారిన పడతామని భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై మున్సిపాలిటీ డిఇ హేమచంద్రను వివరణ కోరగా లీకేజీ పైపులను బాగు చేసి తాగునీటిని కాలనీలకు సక్రమంగా సరఫరా చేస్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లీకేజీ పైపులను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు పుట్టపర్తికి గవర్నర్

రేపు బాబా జయంత్యుత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం నాడు పుట్టపర్తికి విచ్చేయనున్నారు. శ్రీసత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. గవర్నర్ పర్యటన వివరాలను కలెక్టర్ టిఎస్.చేతన్ గురువారం ప్రకటన ద్వారా తెలియజేశారు. గురువారం రాత్రి 8 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 10 గంటలకు చిలమత్తూరు మండలం రక్ష అకాడమీ అతిథి గృహంలో కొంత సమయం విశ్రాంతి తీసుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 11 గంటలకు పుట్టపర్తి సాయి శ్రీనివాస అతిథి గృహానికి చేరుకుంటారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి బాబా సమాధిని సందర్శించుకుంటారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ భగవాన్ సత్య సాయి బాబా 99వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఉదయం 11:05 గంటల 11:20 గంటల వరకు శ్రీ సాయి శ్రీనివాస అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు. అక్కడి నుంచి పుట్టపర్తి నుండి రోడ్డు మార్గం ద్వారా మధ్యాహ్నం 12:20 నిమిషాలకు రక్ష అకాడమీ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుని, 12:35 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బెంగళూరు వెళ్లనున్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ పరిశీలన

గవర్నర్ పుట్టపర్తికి విచ్చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్నలు సత్యసాయి ట్రస్టు సభ్యులతో కలిసి గురువారం ఏర్పాట్లు పరిశీలించారు. సాయి శ్రీనివాస అతిథి గృహాన్ని పరిశీలించి అక్కడి ఏర్పాట్లుపై అధికారులతో మాట్లాడారు. ఆ ప్రాంతంలో సూచిక బోర్డులు ప్రదర్శించాలని ఆర్డీవోను ఆదేశించారు. ప్రోటోకాల్, పోలీసు బందోబస్తు ఏర్పాటు, సాయి శ్రీనివాస్ అతిథి గృహమునందు, కుశ్వంత హాలు, కాన్వాయ్ నిర్వహణ ట్రాఫిక్ సడలింపు, పారిశుధ్య పనులు, బ్యారి గేడ్స్ ఏర్పాటు చర్యలు తదితర వాటిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టిని సారించాలన్నారు. గవర్నర్‌కు స్వాగతం పలికే సమయం నుంచి వీడ్కోలు వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన మేరకు చర్యలు తీసుకుని పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సాయి శ్రీనివాస అతిథి గృహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అమిగోస్‌పై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలో అమిగొస్ మినరల్స్, మైనింగ్ శాఖ సంయుక్తంగా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై రాయల్టీలు, పెనాల్టీల పేరుతో చేస్తున్న వేధింపులపై సింగనమల ఎమ్మెల్యే స్పందించాలని సిపిఎం నాయకులు కోరారు. అమిగోస్ మినరల్స్ సంస్థ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.150 కోట్లను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆ ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సీనియర్ నాయకులు వి.శివారెడ్డి, మండల కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు తదితరులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుక్కరాయసముద్రం మండలంలో దాదాపు 100కు పైగా ట్రాక్టర్ యజమానులు ఉన్నారన్నారు. రాళ్లు కంకర, ఇసుక, మట్టిని తవ్వుకుని అనంతపురం నగరానికి రవాణా చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అమిగోస్ మినరల్స్ రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ, గనుల శాఖతో ఒప్పందం చేసుకుని రాయల్టీలు, ఫెనాల్టీల పేరుతో ట్రాక్టర్ యజమానులను వేధించడం, దాడులు చేయడం మొదలైందన్నారు. ఇటీవల అమిగోస్ మినరల్స్ సంస్థ అక్రమ మైనింగ్, అక్రమ వసూళ్ల దందా అధికం అయ్యిందని తెలిపారు. ఇక అమిగోస్ మినరల్స్ సంస్థ ఒక్క అనంతపురం జిల్లా నుంచి 2023 ఏప్రిల్ నుంచి 2024 ఆగస్ట్ వరకు మైనింగ్ శాఖకు రూ.130.12 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి నెలా రూ.11 కోట్లు కట్టకుండా ప్రభుత్వానికి గండికొడుతోందని తెలిపారు. మరో వైపు ట్రాక్టర్ల యజమానులపై రాయల్టీలు, ఫెనాల్టీల పేరుతో దాడి చేస్తూ వేల రూపాయలు వసూలు చేస్తోందన్నారు. అమిగోస్ మినరల్స్ సంస్థ అక్రమంగా సంపాదించిన డబ్బుతో అప్పటి ప్రభుత్వాన్ని గెలిపించడానికి ఎన్నికల్లో ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.30 కోట్ల వరకు ఇచ్చినట్లు విమర్శలు ఉన్నాయన్నారు. అమిగోస్ మినరల్స్ సంస్థ అవినీతి, అక్రమాలకు పాలకులు అండదండలు ఉన్నాయన్నారు. ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓడిపోవడంతో అమిగోస్ మినరల్స్ సంస్థ టిడిపి ప్రభుత్వంలో ఎఎంఆర్ అనే సంస్థతో లోపాయికారీగా రాజీ పడిందన్నారు. ఇటీవల ప్రభుత్వం మారిన తర్వాత అమిగోస్ వారి పాత విధానాన్ని కొనసాగించడానికి పూనుకుందన్నారు. ఇప్పటికే గార్లదిన్నె మండలం కల్లూరులో అక్రమ మట్టి రవాణా జరుగుతోందని, దీని వెనుక అమిగోస్ సంస్థ ప్రస్తుతం నడిపిస్తున్న ఎఎన్ఆర్ సంస్థలు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాక్టర్లపై రోజువారీ జీవనం సాగిస్తున్న యజమానులు, కూలీలు, హమాలీలపై చేస్తున్న దోపిడీని నియంత్రించేలా అధికారులు, నియోజకవర్గం ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పు ఒకరిది.. శిక్ష మరొకరికి..?!

◆ మలుపుతిరుగుతున్న అనంత డంపింగ్‌యార్డు అవినీతి వ్యవహారం

◆ 30 మంది కిందిస్థాయి సిబ్బంది వేతనాలు నిలుపుదల చేసేలా లేఖ.?



అనంతపురం డంపింగ్ యార్డు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్‌లో జరిగిన అవినీతికి బాధ్యులను వదిలిపెట్టి అక్కడ విధులు నిర్వహించే సాధారణ ఉద్యోగులకు శిక్ష విధించేలా చర్యలు నడుస్తున్నట్లు సమాచారం. డంపింగ్ యార్డులో పని చేస్తే 30 మంది సాధారణ ఉద్యోగుల వేతనాలు నిలుపుదల చేసే ప్రయత్నాలు సాగుతున్నట్టు ప్రచారం నడుస్తోంది. డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టేందుకు నిర్వహించిన టెండర్లలో రూ.23 కోట్లకు టెండర్ దక్కించుకున్న గ్రీన్‌ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ పనులు చేపట్టింది. గుడ్‌విల్ పేరుతో కొందరు ఒత్తిళ్లు తీసుకురావడంతో ఆ సంస్థ మధ్యలోనే పనులను నిలిపేసి వారి యంత్రాలను అక్కడ నుంచి తీసుకెళ్లింది. మధ్యలో పనులను నిలిపేసి బయోమైనింగ్ ప్రక్రియ పూర్తి చేయకుండానే వెళ్లిన సంస్థ అప్పటికే రూ.10 కోట్ల బిల్లులు వసూలు చేసుకుంది. దీంతో పాటు మరో రూ.2కోట్ల బిల్లులు చేసుకోవడానికి కంపెనీ ప్రతినిధులు అప్పటి అకౌంట్ ఆఫీసర్ పద్మావతితో సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు అకౌంట్ నుంచి బిల్లులను ప్రాసెస్ చేశారు. డంపింగ్‌యార్డు బయో మైనింగ్‌పై జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు చేసిన పనులు... బిల్లుల చెల్లింపుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటి కమిషనర్ మేఘ స్వరూప్ కౌన్సిల్ అభిప్రాయానికి వ్యతిరేకంగా బయోమైనింగ్ సంస్థ కోరిన విధంగా రూ.రెండు కోట్ల బిల్లులకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేసి పంపారు. ఎగ్జామినర్ ఈ ఫైలును పరిశీలించి నిలుపుదల చేశారు. టెండర్ నిబంధనల ప్రకారం రోజుకు 1000 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉన్న యంత్రాలు తమ వద్ద ఉన్నాయని టెండర్ దక్కించుకున్న గ్రీన్‌ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ వారు సమర్పించిన పత్రాల్లో పేర్కొంది. అయితే మెజర్మెంట్ బుక్‌లో మాత్రం ఇంజినీరింగ్ అధికారులు రోజుకు 2000 టన్నుల చెత్తను శుద్ధి చేసినట్టుగా రికార్డు చేశారు. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా రోజుకు 2000 టన్నుల చెత్త బయోమైనింగ్ ఎలా జరిగిందో వివరాలు సమర్పించాలని ఎగ్జామినర్ గోవిందు సంబంధిత బిల్లుపై అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ అభ్యంతరంతో బయోమైనింగ్ బిల్లు రూ.2కోట్లు పెండింగ్‌లో నిలిచినట్లు సమాచారం.

బయోమైనింగ్ వ్యవహారంలో వాస్తవాలను నిగ్గుతేల్చే క్రమంలో భాగంగా నియోజకవర్గం ప్రజాప్రతినిధి దానికి సంబంధించి విధులు నిర్వహించిన 30 మంది ఉద్యోగుల వేతనాలు నిలిపివేయాలంటూ కమిషనర్‌కు లేఖ రాసినట్టు ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనికి తగ్గట్టుగానే రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కేశవులు, కమిషనర్ నాగరాజు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, కంపోస్ట్‌యార్డును ఇటీవల సందర్శించారు. ప్రజాప్రతినిధి లేఖ రాసిన నేపథ్యంలోనే ఈ అధికారులు కంపోస్ట్ యార్డును తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల పనుల టెండర్‌ను దక్కించుకుని బిల్లులు చేయించుకుని వెళ్లిన సంస్థను వదిలేసి కిందిస్థాయి సిబ్బందిని బలి పశువులు చేసేందుకు ఉన్నతాధికారులు యత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుడ్‌విల్ రూపంలో చేతులు మారిన సొమ్ము వ్యవహారంలో బడా బాబులను వదిలేసి చిరు ఉద్యోగులపై ప్రతాపం చూపటం సరికాదని ఉద్యోగులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. వేతనాల నిలుపుదల జరిగితే ప్రభుత్వం, ఉన్నతాధికారులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయం కార్పొరేషన్ ఉద్యోగుల నుంచి వ్యక్తం అవుతోంది.

శాస్త్రీయ ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచాలి : కలెక్టర్



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ విధానంలో ఆలోచన శక్తి, నూతన ఆవిష్కరణలు చేసే సామర్థ్యాలు పెరుగుతాయని ఈ మేరకు విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని శారద నగర్ జిల్లా సైన్స్ మ్యూజియంలో సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌పై కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్స్ జిల్లాలో 21 ఉండగా అందులో 19 ల్యాబ్స్ ప్రస్తుతం పని చేస్తున్నాయన్నారు. నిబంధనల ప్రకారం ఆయా పాఠశాలల అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నోడల్ అధికారులకు వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. ఇందులో శిక్షణ తీసుకున్న వారు వారి పాఠశాలలో మరొకరికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ల్యాబ్స్ కార్యకలాపాలను నిత్యం కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించి వారిలో సైన్స్ దక్పథాన్ని పెంపుదించాలన్నారు. జిల్లా సైన్స్ మ్యూజియంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా ప్రతి ఏడాది ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నూతన ఆవిష్కరణల్లో జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయికి వెళ్లేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, సైన్స్ ఆఫీసర్ బాలమురళీకృష్ణ, డిపిఎం నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కార్మిక, రైతాంగ సమస్యల పరిష్కారానికి

ఐక్య ఉద్యమాలు

26న మహాధర్నాను జయప్రదం చేయాలి-జిల్లాలో కొనసాగిన రైతు, కార్మిక సంఘాల జీపుజాతా

ప్రజాశక్తి-గుత్తి

ఐక్యంగా ఉద్యమాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం ద్వారానే కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా గురువారం గుత్తికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమ సమయంలో లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. బడా కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే రైతాంగం, కార్మికులు, ప్రజలపై అధిక భారాలను మోపుతున్నారన్నారు. పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రూ.14.65 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నా రైతన్నలకు ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే మహాధర్నాకు కార్మికులు, కర్షకులు, ప్రజలు, పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా నాయకురాలు కవిత, మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, నాయకులు కె.మహేష్, కె.బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రైతాంగ, కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా గురువారం పెద్దవడుగూరు, కిష్టిపాడు మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, సూరి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, సిపిఎం నాయకులు కృష్ణనారాయణ, రైతుసంఘం నాయకులు పెద్దన్న, ఆర్ఎంపీ డాక్టర్ నూర్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ప్రజాసంఘా ఆధ్వర్యంలో జీపుజాతా చేపట్టినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 26న అనంతపురం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా గురువారం తాడిపత్రి మీదుగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో ప్రధానంగా నాపరాల్లో పరిశ్రమంలో పని చేసే కార్మికులు, బీడీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, అధ్యక్షులు సూరి, కళాకారులు శ్రీనివాసులు, సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, అంజి, నాగరాజు, ఓబులేసు, శ్రీరాములు, నరసింహారెడ్డి, రామ్మోహన్, జుబేర్, రమాదేవి పంచాయతీ కార్మికులు రాణి, సంధ్యాబాయి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఈనెల 26న కలెక్టరేట్ ముందు చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా గురువారం కడవకల్లుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మండల కార్యదర్శి పెద్దయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి వెంకటచౌదరి, భాస్కర్, జె.పెద్దయ్య, కుళ్లాయప్ప, ఆదినారాయణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు


పామిడిలో మాట్లాడుతున్న సిఐటియు, రైతుసంఘం నాయకులు

పామిడి : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ ముందు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా గురువారం మండల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సూరి, ప్రజా నాట్యమండలి కళాకారులు శ్రీనివాసులు, పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై ఈనెల 26న కలెక్టరేట్ ముందు చేపట్టన్ను మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద ఉన్న ఐఎంఎల్ డిపోలో హమాలీలతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, తిరుపాలు, ఐఎంఎల్ డిపో మేస్త్రీ నాగార్జున, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సంగప్ప, ప్రకాష్, పెద్దన్న, వేణు, నంద, నల్లప్ప, నాగేంద్ర, రామకొండ, సురేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : 26న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా గురువారం శింగనమల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రైతుసంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి, అధ్యక్షులు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, వెంకటస్వామి, పి.శ్రీనివాసులు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు

ప్రజాశక్తి-నార్పల


పైపులైన్ పనులు చేస్తున్న కార్మికులు

పంచాయతీ పైపులైన్ లీకేజీలకు ఎట్టకేలకూ అధికారులు మరమ్మతులు చేశారు. మండల కేంద్రంలోని వడ్డేవారి కాలనీల సమీపంలో పంచాయతీ పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజాశక్తి దినపత్రిలో గురువారం 'తాగునీటి వృథాను అరికట్టరా'..? అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన సర్పంచి సుప్రియ, కార్యదర్శి శ్యామల పంచాయతీ కార్మికులతో పైపులైన్ల మరమ్మతుల చేపట్టి తాగునీటి లీకేజీని అరికట్టారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత మృతి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలం పరిధిలోని సింగనగుంటపల్లి గ్రామానికి చెందిన సునీత మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్న 3 గంటల సమయంలో సునీత తోటకు వెళ్లింది. అయితే సాయంత్రం అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో భర్త శంకర్ తోటకు వెళ్లి చూశాడు. తోటలో విగతజీవిగా భార్య కనిపించడంతో కన్నీరుమున్నీరు అయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్


కమిషనర్ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, ఇంజినీరింగ్ కార్మిక నాయకులు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ తీగలు పడి యల్లనూరు మండలంలోని దంతాలపల్లి వద్ద మృతిచెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం తాడిపత్రి మండల కార్యదర్శి రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, మృతులకు ఒక్కొక్కరికి రూ.30 లక్షల చొప్పున పరిహారం అందించాలని కోరుతూ తాడిపత్రి రూరల్ విద్యుత్ శాఖ ఏడికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎడి మీ వినతిని ఉన్నతాధికారులకు పంపి బాధిత కుటుంబానికి న్యాయం చేయనున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష ఉన్నారు.

జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపల్ ఇంజినీరి ంగ్‌లకు జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు అంజి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషన ర్ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు 25 సంవత్సరాలుగా వివిధ భాగాల్లో ఇంజినీరంగ్ కార్మికులు పని చేస్తున్నారు. వారందరూ చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. కావున పారిశుధ్య కార్మికుల మాదిరిగా జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోశాధికారి, డీ.జుబేర్, ఎస్.మహబూబ్‌బాషా, జిపి.ప్రసాద్, ఇంజనీరింగ్ కార్మికులు రాము, శేఖర్ కార్మికులు పాల్గొన్నారు.


కెనాల్ వద్ద పహారా కాస్తున్న రైతులు

హెచ్చెల్సీ కాలువపై రైతుల పహారా

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంతోపాటు కోమటికుంట్ల రైతులు హెచ్చెల్సీ కాలువపై పహారా కాస్తున్నారు. నార్పల మండలంలోని దుగ్గుమరి డీప్‌కట్ నుంచి పుట్లూరు మండలంలోని సుబ్బరాయుడు సాగర్‌కు హెచ్చెల్సీ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈనేపథ్యంలో నార్పల నుంచి సుబ్బరాయసాగర్ వరకూ ఎవరూ హెచ్చెల్సీకి తూములు ఎత్తి నుంచి పిల్ల కాలువలకు నీరు వదలకుండా కాపలా ఉంటున్నారు. దీంతో రైతులు చందాలు వేసుకుని సుమారు ఐదు వాహనాల్లో రాత్రింబవళ్లు కాపలాగా తిరుగుతున్నారు. రోజుకు రూ.15 నుంచి రూ.20వేల వరకూ ఖర్చు అవుతోందని రైతులు తెలిపారు.

గుత్తి ఎక్సైజ్ సిఐగా ఇ.మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి



గుత్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఇ.మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి సీఐగా పనిచేసే పి.గురునాథ్‌రెడ్డి మడకశిర మొబైల్ పార్టీకు బదిలీపై వెళ్లనున్నారు. మడకశిర మొబైల్ పార్టీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఇ.మోహన్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. నూతన ఎక్సైజ్ సీఐకు ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది స్వాగతం పలికారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాలను నిర్మూలించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని విడపనకల్లు ప్రభుత్వ వైద్యాధికారి రాజేంద్ర సూచించారు. గురువారం మండల పరిధిలోని మాలాపురం గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం-1994, బేటీ బచావో బేటీ పడావో, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలుగు నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పుష్ప, హరిప్రియ, హెల్త్ ఇండికేటర్ వేణుగోపాల్, సిహెచ్ఒ ప్రమీలమ్మ, సూపర్‌వైజర్ చిన్నకంబయ్య, హెల్త్ అసిస్టెంట్ నూర్, ఎంఎల్‌హెచ్‌పి శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

15లోపు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు డిసెంబర్ 15వతేదీలోపు నిర్దేశించిన బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం మండల పరిధిలోని 74 ఉడేగోళం రైతు సేవాకేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఐదు మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె కామన్ సర్వీస్ సెంటర్, పోస్ట్ ఆఫీస్, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల దగ్గర బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఎకరా శనగ పంటకు రూ.450, మొక్కజొన్నకు రూ.525, వేరుశనగకు రూ.480, జొన్నకు రూ.315 ప్రకారం బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో రైతులకు ఈ విషయం పై అవగాహన కల్పించాలన్నారు. పిఎం కిసాన్‌పై రైతు సేవాకేంద్రం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈనెల 26 నుండి 28వ తేదీ వరకూ తుపాను ఉన్నందున రైతులు వరి కోతలు చేయకుండా సమాచారం తెలియచేయాలన్నారు. డిడిఏ మద్దిలేటి, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజ కుమారి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. పంటల్లో పురుగులు, తెగుళ్లకు సంబంధించి నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, గుమ్మగట్ట, బొమ్మనహాల్, కనేకల్, డి.హీరేహాళ్ మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం


మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి ఇబి.దేవి

ప్రతిఒక్కరూ కళ్లను సంరక్షించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి తెలిపారు. ప్రపంచ ప్రీమెచ్యూరిటీ వారం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సిఇఒ సూర్యప్రకాష్ పిల్లలు ఎలాంటి కంటి పరీక్షలు చేయించుకోవాలనే విషయాలను వివరించారు. సర్వజన ఆసుపత్రిలోని త్వరిత చికిత్స కేంద్రంలో జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుత్రి కడప సహకారంతో బరువు తక్కువగా పుట్టిన, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, గుండె లోపం, రక్తహీనత ఇతర వ్యాధులతో బాధపడుతున్న పిల్లలను సమీకరించి వారికి కంటి రెటీనా పరీక్షలను 'రెడ్ కామ్' అనే పరికరంతో స్క్రీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మానస, దివ్య, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు శ్రీవిద్య, కంటి పరీక్ష నిపుణురాలు జ్ఞానప్రసన్న, మేనేజర్ రజిత, స్టాఫ్‌నర్సు మౌనిక, సోషల్ వర్కర్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వాసుదేవరెడ్డి కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆపార్ కార్డు ఐడి జనరేట్‌లో కొన్ని అవంతరాలు ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్‌లో పేర్లు మార్పులు, జనన తేదీ మార్పు తదితర వాటికి కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వజ్రకరూరు విద్యార్థి

ప్రజాశక్తి-ఉరవకొండ


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

వజ్రకరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బి.వంశీకృష్ణ అండర్-19 జూడో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కృష్ణానాయక్ తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థితోపాటు తర్ఫీదు ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రాజేష్, శ్రీనివాసులును అభినందించారు. వంశీకృష్ణ ఈనెల 23, 24వ తేదీల్లో చిత్తూరు జిల్లా రేణిగుంటలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఖరీదైన ఉచిత వైద్యం

అంతర్జాతీయ సదస్సులో మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలందరికీ ఖరీదైన ఉచిత వైద్యం అందిస్తున్నట్లు మేయర్ మహమ్మద్ వసీం సలీం తెలిపారు. ఇరాన్‌లోని ఖోర్రామాబాద్‌లో 10వ జనరల్ ఇంటర్నేషనల్ పట్టణ ఆరోగ్యం, ఎన్విరాన్‌మెంట్ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సులో పాల్గొన్న అనంతపురం మేయర్ వసీం మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం ఆరోగ్యశ్రీ కింద 3,257 ప్రొసీజర్స్ తీసుకొచ్చారన్నారు. బాధితులు రికవరీ అయ్యేంతవరకూ ఆసరా భరోసా కల్పించారన్నారు. ఇంటి వద్దకే వెళ్లి ఫ్యామిలీ డాక్టరు చికిత్స అందించే విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు కొత్తవి నిర్మాణం చేపట్టి అక్కడ కూడా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్యులను నియమించాలని గుర్తు చేశారు. పేదలందరికీ మంచి ఆరోగ్యం అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దామన్నారు. 104, 108 సేవల ద్వారా బాధితుల చెంతకే ఆరోగ్యం అందించే అవకాశం లభించిందన్నారు. కరోనా సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-ఉరవకొండ


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మహిళలు

తాగునీటి సమస్య తీర్చండి మహాప్రభో అంటూ మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. పది రోజులుగా తాగునీటి సమస్య నెలకొన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన మహిళలు విడపనకల్ మండల కేంద్రంలో 42 జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఉప్పరకాలనీ, సుంకులమ్మ కాలనీల్లో పదిరోజులుగా తాగునీటి నెలకొన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. చేసేది లేక ధర్నాకు దిగినట్లు తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగింది. విషయం తెలుసుకున్న సిఐ చిన్నగౌస్ ఘటనా స్థలనానికి చేరుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-యాడికి

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని నెంబర్-3 పాఠశాలలో కుష్టువ్యాధి (లెప్రసీ)పై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ద్వారా మెడికల్ అధికారి రామచంద్ర, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎం స్వర్ణలత, ప్రధానోపాధ్యాయులు ఎ.సుశీలబాయి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, సుజాత, మహబూబ్‌బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్ : ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్.శ్రీధర్ కుమార్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్యాధికారి పి.వెంకటప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్.. 94406 61900, 90109 65230 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రధాని ఆవాస్ యోజన అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి-పామిడి

మండల పరిధిలోని ఎద్దులపల్లి, రామగిరి, కత్రిమల గ్రామాల్లో మండల గృహనిర్మాణ శాఖ అధికారి మారుతి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం లబ్ధిదారుల అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజోష్ణ గృహ లబ్ధిదారులకు సలహాలు, సూచనలు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం

నగరానికి చెందిన ఎజి.అనిల్ కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు చేతి తొడుగులు, శానిటరీ ప్యాడ్‌లు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేసే పారిశుధ్య కార్మికులను కాపాడుకునే బాధ్యత ప్రతి నగర పౌరునిపై ఉందన్నారు. అందుకోసమే తనవంతు బాధ్యతగా నాణ్యమైన గ్లౌస్‌లు, బూట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌జిఎఫ్ అండర్-19కు ఆత్మకూరు విద్యార్థులు

ప్రజాశక్తి-ఆత్మకూరు


క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎస్‌జిఎఫ్ అండర్-19 క్రికెట్ పోటీలకు ఆత్మకూరు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాకేంద్రంలోని పిటిసి మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఆత్మకూరు జూనియర్ కళాశాల విద్యార్థులు ఆర్.మదన్‌మోహన్‌రెడ్డి, సి.శ్రీనాథ్, పి.అక్షయరెడ్డి ఎంపికైనట్లు పిఇటి లక్ష్మీనారాయణ, ఆర్టీసీ రఫీ తెలిపారు.

23, 24న ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈనెల 23, 24వ తేదీల్లో చేపట్టనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రాన్ రిజిస్ట్రింగ్ ఆఫీసర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ బూత్ స్థాయి అధికారి ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కావున 18ఏళ్ల పైబడిన యువతీ, యువకులు కొత్తగా ఓటర్ నమోదుకు, ఇదివరకే ఓటరు జాబితాలో పేర్లు ఉండి సవరణలు, మార్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

హేమశ్రీ మెడికల్ స్టోర్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం



ప్రారంభమైన హేమశ్రీ మెడికల్ స్టోర్

నగరంలోని శ్రీ కంఠం సర్కిల్‌లో ఉన్న హేమశ్రీ మెడికల్, జనరల్ స్టోర్ గురువారం పున:ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకులు కుమారిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా అనంతపురం ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆదరణతో సుదీర్ఘకాల అభిమానంతో మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ప్రారంభించినట్లు వివరించారు. ప్రజలకు అవసరమైన మెడికల్ నాన్ మెడికల్ సర్జికల్ వస్తువులు డిస్కౌంట్ ఆఫర్లతో అందిస్తున్నట్లు చెప్పారు.

అక్రమ కేసులకు భయపడొద్దు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిద్దాం -వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'పోరాటం అనేది మన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైసిపికి కొత్తేమీ కాదు.. కూటమి ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, అక్రమ కేసులు పెట్టినా బలంగా నిలబడదాం.. ప్రజల పక్షాన నిలుస్తూ వారి గొంతుకవుదాం' అంటూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాయలంలో లీగల్ సెల్, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సోషల్ మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతుంటే ఓర్వలేక అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా యాక్టివిస్టులు అధైర్యపడొద్దని సూచించారు. మీకు, మీ కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా జిల్లా అధ్యక్షుడిగా తాను తోడుగా ఉంటానని తెలిపారు. త్వరలోనే జిల్లా స్థాయిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మనం పోరాటం చేస్తోంది పదవుల కోసం కాదని, రాష్ట్ర ప్రజలకు మంచి జరగడం కోసమని స్పష్టం చేశారు. వైసీపీ అవిర్భావం నుంచి సోషల్ మీడియా ఎంతో కీలకంగా వ్యవహరించిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలోనూ ప్రజాపక్షంగా నిలుద్దామన్నారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత వైఎస్ జగన్‌ను ఒంటరి చేసి అణగదొక్కాలని చూశారని, ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం ఐదు నెలలుగా ఏమీ చేయకపోయినా చంద్రబాబు మాత్రం బిల్డర్ ఇస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిక్షణం ఎత్తిచూపుదామని పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, వాటిని కూడా మరోసారి ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. వాగ్దానాలను అమలు చేయడంలో విఫలం అయ్యారన్నారు. ప్రభుత్వ హామీలు, వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా వాస్తవాలతో ప్రజలకు వివరిద్దామని పిలుపునిచ్చారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉన్నా లీగల్ సెల్ ప్రతినిధులు అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ఉమాపతి మాట్లాడుతూ సోషల్ మీడియా యాక్టివిస్టులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోనూ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రత్యేకంగా న్యాయబందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎవరికి ఏ సమయంలో అవసరం వచ్చినా లీగల్ టీంలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి టాస్క్‌ఫోర్స్ జిల్లా ప్రతినిధి రమేష్‌గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, లీగల్ సెల్ ప్రతినిధులు రాజశేఖర్‌యాదవ్, వెంకటరాముడు, శ్రీనివాసరెడ్డి, గోపాలకృష్ణ, తిమ్మారెడ్డి, ప్రభుకుమార్, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాగన్న, అన్ని నియోజకవర్గాల వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల పెంపును ఉపసంహరించుకోవాలి

అనంతపురం : పాఠశాలల పనివేళలు పెంచడంపై ప్రభుత్వ ఆలోచన సరైనది కాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం కణేకల్లు మండలంలోని పూలచెర్ల, కణేకల్లు క్రాస్, ఎర్రగుంట, గణిగేర, మాళ్యం, జక్కలవడికి, తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పనివేళలు పెంచడం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు మానసిక ఇబ్బందులకు గురవుతారన్నారు. కావున వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా కార్యదర్శి వి.రామకృష్ణ, మండల సీనియర్ నాయకులు పి.కిరణ్, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-గుత్తి



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, న్యాయవాది ఫక్రుబాషా హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా హైకోర్టు బెంచ్ ఏర్పాటును రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదించేందుకు హైకోర్టుకి లేఖ రాశారన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా పన్నుల వసూళ్లు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ బి.జబ్బర్‌మియా ఆధ్వర్యంలో వంద శాతం ఆస్తి పన్నుల వసూళ్ల కార్యక్రమానికి గురువారం చేపట్టారు. ఇందులో భాగంగా 18 వ వార్డులో ఉన్న రవితేజ మార్ట్ కు సంబంధించి ఇంటి నీటి పన్నులు రూ.1,26 లక్షలు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్ల కోసం సచివాలయ ఉద్యోగులు, నోడల్ అధికారుల ద్వారా ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజలు వంద శాతం పన్నులు చెల్లించాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవిన్యూ అధికారి సతీష్ కమలాకర్, ఆర్ఐ షేక్షావలి, సచివాలయ ఉద్యోగి ఆనంద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పరిహారంపై విచారణ

పుట్లూరు : జాతీయ రహదారి 544-డి విస్తరణలో భాగంగా భూములు, స్థలాలు కోల్పోయి పరిహారం రాని బాధితులపై సంయుక్త కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ గురువారం విచారణ చేపట్టారు. మండలంలోని అరకటవేముల గ్రామ పొలాలు, నిర్మాణాలు చేసుకున్న వారి నష్టపరిహారం మంజూరుపై బాధితులతో విచారించారు. ఇందులో కొన్ని ప్రభుత్వ భూమిలో రైతులు పొలాలకు వేసుకున్న నీటి పైప్‌లైన్లు, ఆలయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ జి.కేశవనాయుడు, తహశీల్దార్ శేషారెడ్డి, ఎ.కొండాపురం రైతులు, మండల సర్వేయర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు అరెస్టు

బ్రహ్మసముద్రం : వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. గురువారం మండల పరిధిలోని పాల వెంకటాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి 50 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే వేపులపర్తి గ్రామానికి చెందిన కొల్లప్ప కుమారుడు కరియన్న గ్రామంలో యూనియన్ బ్యాంకు దగ్గర తాగి హల్ చల్ చేయడంతో అతని మీద న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. ఇరువురి పై కేసులు నమోదైనట్లు తెలిపారు.

ఘనంగా శర్మస్‌వలి ఉరుసు

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరులో వెలసిన శర్మస్‌వలి దర్గా ఉరుసును గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తర్వాత స్వామివారికి చక్కెర, బెల్లం తూకాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు హర్షణీయం

ప్రజాశక్తి-పుట్లూరు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండలంలోని తాగు, సాగునీటి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం హర్షణీయమని మండల టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని గండికోట రిజర్వాయర్ నుంచి పుట్లూరు, సుబ్బరాయుడు సాగర్‌కు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే విన్నవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయుడు, వీరయ్య, చలపతి, నారపరెడ్డి, శివయ్య, చంద్ర, రామయ్య, గూడు, పుట్లూరు వీరారెడ్డి, బాలన్న, తదితరులు ఉన్నారు.

శింగనమల : నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించడం హర్షణీయమని తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ అన్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని మరువ కొమ్మ బ్రిడ్జి, చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలకు ఆర్అండ్ఆర్ కొత్త ప్యాకేజీకి నిధులు కేటాయించాలని, రాచేపల్లి లెదర్ ఫ్యాక్టరీని పునర్ ప్రారంభించాలని కోరడం సంతోషకరమన్నారు. అంతేగాకుండా నియోజకవర్గంలోని ఆరు మండలాలని కరువు మండలాలుగా ప్రకటించాలని, తాగు, సాగునీరు ఇవ్వాలని కోరడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటిపట్టాల అవకతవకలపై విచారణ

గుత్తి : మండలంలో ఇంటి పట్టాల పంపిణీలో జరిగిన అవినీతి,అక్రమాలపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని కరిడికొండ రెవెన్యూ పంచాయతీలోని మజరా గ్రామమైన బాచుపల్లి లో సర్వే నంబర్ 149,179-9,188 లో ఉన్న నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో 118 మందికి పంపిణీ చేసిన ఇంటి పట్టాల్లో అవకతవకలు జరిగాయని మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి కి చెందిన జి.మస్తానప్ప అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ కుమ్మక్కై అనర్హులైన వారిని లబ్ధిదారులుగా చూపుతూ ఒక్కొక్కరితో రూ.3 లక్షలు చొప్పున వసూలు చేసుకుని ఇంటి పట్టాలు అందజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ బందం గురువారం గుత్తి తహసీల్దార్ కార్యాలయం విచారణ చేపట్టారు. తహశీల్దార్ డి.ఓబులేసును విచారించారు. అనంతరం బాచుపల్లి గ్రామంలో అధికారులు విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక

అనంతపురం : నగరంలోని పిఆర్‌టియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు టి.పురుషోత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.తిమ్మారెడ్డి గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతపురం నగరపాలక పిఆర్‌టియు అధ్యక్షురాలిగా ఉమాదేవి, ప్రధాన కార్యదర్శిగా లలితాదేవితోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు సీనియర్ నాయకులు ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల పనివేళల మార్పు తగదన్నారు. ప్రభుత్వ వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కేసవరెడ్డి, యల్లప్ప, రమణారెడ్డి, జయప్రకాష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, వాసంత్‌రెడ్డి, తిక్కయ్య, సుగుణకుమారి, భాగ్యలక్ష్మి, వనజ, కౌసర్‌బాను, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సంక్షేమ పథకాల సాధన

కళ్యాణదుర్గం రూరల్ : రాజీలేని పోరాటాలు చేయడం ద్వారానే ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు సాధించుకుంటామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలను తిరిగి పొందడానికి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జెఎసి తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, జిల్లా నాయకులు దొనతిమ్మప్ప, నారాయణ, రామచంద్ర, చెన్నమల్ల.నాగరాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి సిఎం కృషి అభినందనీయం

అనంతపురం : రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. సిఎం చంద్రబాబు క్రైస్తవుల శ్మశానాలకు స్థలాలను సేకరించమని మైనార్టీ సంక్షేమ అధికారులకు ఆదేశించడం సంతోషకరమన్నారు. అదేవిధంగా క్రిస్టియన్స్ వివాహ లైసెన్స్ రెన్యువల్ మూడేళ్ల నుంచి వంద సంవత్సరాలకు పెంచడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాలు క్రైస్తవుల అభివృద్ధికి సంక్షేమానికి ప్రయోజనకరమైన అంశాలుగా ఉన్నాయని జిల్లా పాస్టర్స్, క్రైస్తవులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన సాంబశివారెడ్డి

శింగనమల : తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని నియోజకవర్గ నేత ఆలూరు సాంబశివారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు జగన్ స్పందిస్తూ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారు.

ఎడారి నివారణకు ప్రత్యేక నిధులివ్వాలి

అసెంబ్లీలో 'కాలవ' వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గంలో శరవేగంగా విస్తరిస్తోన్న ఎడారిని నివారించడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. గురువారం ఉదయం అసెంబ్లీ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎడారీకరణ నివారణపై కాలవ మాట్లాడారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడి, అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం రాయదుర్గం అన్నారు. ఈ నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో ఇప్పటికే ఎడారి ఛాయలు అలుముకున్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఎడారి దృశ్యాలను గతంలో సినిమాల్లో కూడా చూపించారని గుర్తు చేశారు. ఎడారీకరణ నివారణ కోసం 2014-19 మధ్యకాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇసుక దిబ్బలను తరలించడానికి ఉపాధి హామీ నిధులను వినియోగించి రైతులకు సహకారం అందించారన్నారు. ఇప్పుడు కూడా వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం నుంచి అందే నిధుల్లో రాయదుర్గం నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వాలని వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం అన్నారు. మండలాల్లోని మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పలువురు మంత్రులను కలిసి అసెంబ్లీలో వినతిపత్రాలను గురువారం అందజేశారు. ఇళ్ల పట్టాలు, ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాల పునరావాస పరిహారం, గూగూడు కుళ్లాయిస్వామి సన్నిధి అభివృద్ధికి, కరువు మండలాలకు ప్రత్యేక నిధులను కేటాయించాలని మంత్రులను కోరారు. బుక్కరాయసముద్రం మండలంలోని పలు కాలనీల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఉల్లికల్లు, ఉల్లికంటి గ్రామస్తులకు పునరావాసం ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బి మంత్రి బిసి.జనార్దన్ రెడ్డిని కోరారు. బీసీ,ఎస్సీ స్కూల్స్, హాస్టళ్లలో సౌకర్యాలు, అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని కోరారు. నార్పల మండలం గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవ సన్నిధిని పుణ్యక్షేత్రంగా గుర్తించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను, ఆయల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిని కోరారు. నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఆ మండలాలకు కేంద్ర, రాష్ట్ర నిధులను కేటాయించి, ప్రత్యేకంగా తాగు నీరు, సాగు నీరు సమస్యను పరిష్కరించాలని ఆయా మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేశారు.

మహిళలపై అత్యాచారాలు అరికట్టాలి


ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో నానాటికి పెరిగిపోతున్న మహిళలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక మహిళలు బాలికలు దివ్యాంగులు విద్యార్థులపై అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. చిన్నపిల్లలను చదువుకు బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి

ప్రజాశక్తి-అనంతపురం



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేస్తే మంచి ఫలితాలు వస్తాయని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలామురళి పిలుపునిచ్చారు. ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని డిఎన్‌టి బాలుర వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాటలో మార్పు, పనిలో నేర్పు, ఓటమిలో ఓర్పు ఉంటే చాలు.. జీవితంలో ఎలాంటి విజయాన్నైనా సాధించవచ్చన్నారు. విద్యార్థుల అభిప్రాయం ప్రకారం పాఠశాలకు వెళ్లడానికి ఒత్తిడి ఉండదన్నారు. పరీక్షలు అంటేనే ఒత్తిడి ఉంటుందని, బాగా చదువుకుంటే ఒత్తిడి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ హెచ్‌డబ్ల్యుఓ రవీంద్రనాథ్ ఠాగూర్, విద్యార్థులు, వసతి గృహం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.